స్థానికంగా ఆమే కీలకం..

నియోజకవర్గ వ్యాప్తంగా మహిళా ఓటర్లే అధికం

- పంచాయతీ ఎన్నికలకు ఖరారైన ఓటర్ల జాబితా
- పోలింగ్ కేంద్రాలు కూడా గుర్తించిన అధికారులు



మామిళ్లవారిగూడెం జీపీలో ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా సిద్ధం కాగా, రెండు రోజుల క్రితమే జిల్లా కలెక్టర్ అధికారికంగా విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంట్లో భాగంగా ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలు, వార్డుల సంఖ్య సైతం ఖరారైంది. ఆయా జాబితాలను స్థానిక పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు ప్రదర్శిస్తున్నారు.

నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, ములకలపల్లి మండలాల్లో మొత్తం 105 గ్రామ పంచాయతీలు ఉండగా, 980 వార్డులు నిర్ణయించారు. నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం 1,60,256 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 77,858 మంది, స్త్రీలు 82,391 మంది ఉన్నారు. దీంతో పురుష ఓటర్ల కంటే స్త్రీల ఓట్లు అధికంగా ఉండటంతో నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో వారే కీలకం కానున్నారు. గతంలో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అత్యధికంగా కాగా, తాజాగా ప్రకటించిన జాబితాలో కూడా వారిదే పై చేయి కావడం విశేషం. ప్రభుత్వం త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉండగా, ఆయా స్థానిక సంస్థల పోరులో మహిళలు ఏటు మొగ్గుచూపితే అభ్యర్థుల గెలుపులో ప్రధాన పాత్ర కానుంది.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం పేరు	జీపీల సంఖ్య	పురుషులు	స్త్రీలు	ఇతరులు
అశ్వారావుపేట	30	22,929	24,361	06
దమ్మపేట	31	21,241	23,128	-
చంద్రుగొండ	14	11,602	12,117	01
ములకలపల్లి	20	73,913	14,259	-
అన్నపురెడ్డిపల్లి	10	8,347	8,526	-
మొత్తం	105	77,858	82,391	07

పనిచేసిన చోటుకే తనిఖీకి..



గౌరవవందనం స్వీకరిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

అశ్వాపురం: 20 ఏళ్ల క్రితం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేసి ఇప్పుడు డీఎస్పీగా పోలీస్‌స్టేషన్ తనిఖీకి రావడం జీవితంలో మరువలేని తీపి జ్ఞాపకమని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ రవీందర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీ పోలీసుల గౌరవవందనం అనంతరం స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. కేసుల పురోగతిపై సీఐ, ఎస్సై, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సైగా పనిచేసిన కాలంలో నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలలో కనీస రహదారి సౌకర్యం లేక ఎన్నో కిలోమీటర్లు కాలినడకన నడిచిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ కేసుల పరిష్కారానికి, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై తిరుపతిరావు, ట్రెయినీ ఎస్సై కళ్యాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీలో విద్యార్థులు, పక్కన ఏటీడీఓ

దమ్మపేట: మండల పరిధిలోని పార్కలగండి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ రవి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ, ఏటీడీఓ చంద్రమోహన్ హాజరయ్యారు. చట్టాల రూపకల్పన, ప్రభుత్వ పాలన తదితర అంశాలపై, విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, భద్రు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట సీఆర్‌టీల ధర్నా

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భద్రాచలం ఐటీడీఏ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ మాట్లాడుతూ.. సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలన్నారు. సీఆర్టీల ధర్నాకు యూటీఎఫ్ తరుపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. విజయకుమార్, ప్రసాద్, శ్రీనివాస్, రమేష్‌చంద్, కరుణకుమార్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు న్యాయవాదికి సన్మానం



న్యాయవాది విష్ణువర్ధన్‌రెడ్డితో బార్ అసోసియేషన్ సభ్యులు

దమ్మపేట: హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ మెంబర్ పి.విష్ణువర్ధన్ రెడ్డిని దమ్మపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. శుక్రవారం విష్ణువర్ధన్ రెడ్డి దమ్మపేట కోర్టుకు విచ్చేయగా బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ సభ్యులకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, డైరీలు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో అవసరమైన సలహాలు, సూచనలకు సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్‌కుమార్, న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాసరావు, శ్యాం సుధాకర్, గొంది మురళీ, దర్గావలీ, నరేంద్ర, సంధ్యారాణి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజున మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేసిన తేజియా

అశ్వారావుపేటరూరల్: పుట్టినరోజు సందర్భంగా చాక్లెట్, బిస్కెట్, కేక్‌లను పంపిణీ చేయడం మామూలే. కానీ ఓ విద్యార్థిని తన పుట్టిన రోజును పురస్కరించుకొని గురువులకు మొక్కల్ని కానుకగా అందించి ప్రత్యేకత చాటుకుంది. మండలకేంద్రంలోని జవహర్ విద్యాలయ విద్యార్థిని తేజియా తన పుట్టిన రోజు సందర్భంగా గురువులందరికీ వివిధ రకాల ప్రొటాన్ పూల మొక్కలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తేజియాను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని వృద్ధులు, దివ్యాంగులకు పరివర్తన యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానిక పరివర్తన ఫౌండేషన్ కార్యాలయంలో కారు స్టాండ్ అధ్యక్షుడు భాష్యం వెంకటరమణయ్య, మానవ హక్కుల జిల్లా కార్యదర్శి క్రిష్ణ శ్రీనివాసరావు వాల్మీకి దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భానుప్రసాద్, రాజా పెరియార్, రాజేశ్వరరావు, లక్ష్మణస్వామి, వెంకటేశ్వర్లు, దాసు బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని సున్నం బట్టి గ్రామంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ మోహన్, హెచ్‌వీ దుర్గమ్మ, సిబ్బంది బేబి, రవి, సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

అశ్వాపురం: నల్గొండలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మండలకేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో శుక్రవారం సంఘం నాయకులు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ, జిల్లా కార్యదర్శి రాము, మండల అధ్యక్షుడు కారం సీతారామయ్య, చందు, హెచ్ఎం యోగితావేణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కలవల నాగారం శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భట్టుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వాసిరెడ్డి నేతాజీ శుక్రవారం స్కూటీపై మణుగూరు వెళ్తుండగా కలవలనాగారం శివారులో అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలవ్వగా 108లో మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి



మాట్లాడుతున్న గోపగాని శంకర్రావు

బూర్గంపాడు: ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా టీజేఎస్ పార్టీ ఇన్‌చార్జి గోపగాని శంకర్రావు అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కులధ్రువీకరణ పత్రాలు అందించాలని కలెక్టర్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాలు అందించామన్నారు. పేదేళ్ల బీఆర్ఎస్ హయాంలో అమలు కానీ హామీలు ఇచ్చి సంపదను కుటుంబ బంధువులకు దోచిపెట్టారన్నారు. పినపాక కో ఆర్డినేటర్ మూల నాగిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ప్రొఫెసర్ కోదండరాంకు క్యాబినెట్ హోదా కల్పించి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు 200 గజాల ఇంటిస్థలం ఇచ్చి జీవన పరిస్థితులపై అంచనా వేసి నిరుపేదలకు పింఛన్ ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ టౌన్ సెక్రటరీ ఖాదర్‌బాబా, రఘునాథపాలెం మండల కన్వీనర్ ఉన్నం సతీష్‌కుమార్ ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న అధికారులు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీ–బీటీపీఎస్ వరకు కొనసాగుతున్న రైల్వేట్రాక్ పనులకు అడ్డుగా వచ్చిన కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణానికి సింగరేణి అధికారులు శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగరేణి సివిల్ డీవైఎస్‌సీ పాత్రుడు మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం నాటి కట్ట మైసమ్మ దేవాలయాన్ని నూతన రైల్వేట్రాక్ నిర్మాణంలో భాగంగా తరలింపు తప్పనిసరి కావడంతో ప్రధాన రహదారికి రాకపోకలకు ఇబ్బందికరంగా లేకుండా దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆలయ తరలింపు నిర్మాణ పనులకు సహకరించిన సింగరేణి రైల్వే కాంట్రాక్టర్ శ్రీనివాస్‌కు, కాంట్రాక్ట్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.నవీన్‌కుమార్, వి.రవివర్మ, సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ రైల్వే సైడింగ్ మేట్స్, గ్యాంగ్‌మెన్స్ మంగీలాల్, కె.రవికుమార్, వీర్రాజు, శంకర్‌నాయక్, సాంబశివరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైపవర్ వేతనాలు అమలుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు రూరల్ : సింగరేణి అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.శ్యాంసుందర్, ఏరియా అధికార ప్రతినిధి ఎస్.రమేష్‌లకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ.నాసర్‌పాషా మాట్లాడుతూ.. 2013లో దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. సింగరేణిలో మాత్రం అమలు కావడం లేదన్నారు. తద్వారా కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి వేతనాలతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లా రమేష్, మంగీలాల్, గురుమూర్తి, నాగేశ్వరరావు, రజబ్ అలీ, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయంగా ఎదుర్కోలేకే కేసులు'



పినపాక: మాట్లాడుతున్న సతీష్ రెడ్డి



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పినపాక: రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొలేక కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబమే లక్ష్యంగా చేసుకుని ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించిందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి అన్నారు. ఏడూళ్ల బయ్యారం క్రాస్‌రోడ్‌లో శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దీనికి యావత్ తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, వెంటనే కేసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కోలేటి భవానీ శంకర్, పానుగోటి భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవివర్మ, మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, దాట్ల వాసుబాబు, ముక్కు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, కేటీఆర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, మందపాటి మోహన్‌రెడ్డి, గొడవర్తి వెంకటేశ్వరరావు, వెంకన్నబాబు, మోటూరి మోహన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: కేటీఆర్‌పై కేసులు పెట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు లంకా శివ తెలిపారు. ఏసీబీ పెట్టిన కేసులను వెంటనే విరమించుకోవాలన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు



మణుగూరు టౌన్: ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చర్లలో..



బూర్గంపాడు: నిరసన తెలుపుతున్న నాయకులు

- **బూర్గంపాడు:** రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదని, వాటిని నిరసిస్తూ మండల ప్రధాన కూడలిలో కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి చక్రవర్తి, చల్లా వెంకట్ నారాయణ, కణితి కృష్ణ, తలకోల శిరీషారెడ్డి, కన్నెపల్లి శివ, కావటం వెంకట్రామిరెడ్డి, తిరుపతి చంటి, వీరారెడ్డి, కస్నేపల్లి బేబి, తేజావత్ దేవి, నాగిరెడ్డి, మాధవరెడ్డి, చోటే బిహారీ, పాషా, దేగల తిరుమలరావు, కేసుపాక మహేశ్, పుట్టి ప్రసాద్ ఉన్నారు.
- **మణుగూరు టౌన్:** అమిత్‌షా వ్యాఖ్యలు ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ దేశానికి చీకటి రోజుగా అభివర్ణిస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కాటబోయిన నాగేశ్వరరావు, శివసైదులు, తరుణ్‌రెడ్డి, కూరపాటి సౌజన్య, సతీష్, సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడి బాబు, గాండ్ల సురేశ్, కనకలక్ష్మి, గోరంట్ల కనకయ్య, వెంకట్రావ్ గౌడ్, రవీందర్‌రెడ్డి, సీతయ్య, మధుకుమార్, రహీంపాషా, కృష్ణ, అప్పారావు, నాగేశ్వరరావు, సాంబశివరావు, కృష్ణవేణి ఉన్నారు.
- **చర్ల:** అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, తడికల లాలయ్య, మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మడకం పద్మ, నాయకులు ఆవుల పుల్లారావు, కారంపూడి సాల్మన్‌రాజు, సుందర సురేష్, పటేల్ వెంకటేశ్వరావు, రుంజా రాజారావు, తాండవ రాయుడు, రమేష్, ఈశ్వరావు, ఒడియాల శ్రీను, పురుషోత్తం పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

అమిత్‌షా వ్యాఖ్యలు నిరసిస్తూ మండలకేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎడెల్ల గణపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తోటమళ్ల రమణమూర్తి మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు తడికల లాలయ్య, కొంగూరు నర్సింహారావు, తోటమళ్ల వరప్రసాద్, మండల అధ్యక్షులు రుంజా రాజారావు, కారంపూడి సాల్మన్‌రాజు, కొంగూరు సత్యనారాయణ, రవికుమార్, కృష్ణారావు, జయరాజు, శ్రీనివాసరావు, గుండ్ల అమర్, గుండ్ల రంజిత్, మైపా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

- **భద్రాచలంఅర్బన్:** అమిత్‌షా అంబేద్కర్‌పై అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గద్దం స్వామి డిమాండ్ చేశారు. తక్షణమే అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పి, మంత్రి పదవికి కూడా రాజీనామా చేయాలని పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం గంగా, డి.సీతాలక్ష్మి, కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, ఉస్తేల జ్యోతి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.
- **చంద్రుగొండ :** కేంద్రం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను మాలమహానాడు మండలశాఖ ఆధ్వర్యంలో చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లో దహనం చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను సంఘం నాయకులు ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడుగు శంకర్, దాసరి రామారావు, బడుగురాములు, గణేష్, దాసరి క్రాంతి, బేతి వంశీకృష్ణ, బడుగు అఖిల్, దాసు, అన్వర్, శాంతరావు, నరసింహా, పుల్లారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో..



చంద్రుగొండలో దిష్టిబొమ్మ దహనం..

ప్రభుత్వాస్పత్రిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

మణుగూరు రూరల్ : మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఓ డాక్టర్ రవిబాబు కేక్ కట్ చేసి పంచిపెటారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ప్రభుత్వ పదోన్నతిపై ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీపై వెళ్తున్న నరేష్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసుప్రభు బోధనలు ఆచరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, పాల్వంచ సివిల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఎంఓ గౌరి ప్రసాద్, నేత్రవైద్యాధికారి సంజీవరావు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీహెచ్ఓ రవిబాబు

ప్రమాదకరంగా మలుపు..



మొండికుంట-సారపాక రోడ్డులో మలుపు

అశ్వాపురం: మండలపరిధిలోని నెల్లిపాక గ్రామంలో జిన్నింగు మిల్లు వద్ద మొండికుంట–సారపాక రహదారిపై మలుపు ప్రమాదకరంగా మారింది. మలుపు వద్ద ఇరువైపులా ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగి ఎందరో గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయాల్లో రేడియం హెచ్చరిక బోర్డులు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మలుపు సమీపంలోనే జిన్నింగ్‌మిల్లు ఉండటంతో ప్రతీ రోజు పదుల సంఖ్యలో పత్తి వాహనాలు వస్తున్నాయి. వాహనదారులు అక్కడకు రాగానే భయాందోళనకు గురవుతున్నారు. మలుపు వద్ద హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు ఎంతోకాలంగా కోరుతున్నారు. ఆర్అండ్‌బీ, పోలీస్ అధికారులు స్పందించి ఇప్పటికైనా మలుపు వద్ద ఇరువైపులా హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.